# పదేళ్లలో బిఆర్ఎస్ చేయలేని ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను వెయ్యి రోజుల్లో చేసి చూపించాం





### దేవరకద్ర ఎమ్మెల్యే జియంఆర్

**కొత్తకోట, సెప్టెంబర్ 4ంప్రభాత ఉదయం)**

కాంగ్రెస్ ప్రజాపాలన వెయ్యి రోజులు విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా మదనపురం, కొత్తకోట మండలాలలో ఎమ్మెల్యే జిఎంఆర్ భారీ బైక్ ర్యాలీ నిర్వహించి సంబరాలు జరుపుకున్నా.అనంతరం మదనపురం, కొత్తకోట లలో నిర్వహించిన సభల్లో ఎమ్మెల్యే జియంఆర్ పాల్గొని ప్రసంగించారు.ఈ సందర్భంగా ఉదయం మదనపురం మండలం దుప్పల్లి గ్రామంలో మొదలైన బైక్ ర్యాలీ కొత్తపల్లి మీదుగా మదనపురం మీదుగా కొత్తకోట, కానయ పల్లి, సంకిరెడ్డిపల్లి అమడబాకుల మీదుగా కొత్తకోటకు చేరుకుంది, తదనంతరం ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ...గత బీఆర్ఎస్ పాలనలో దేవరకద్ర నియోజకవర్గ అభివృద్ధిని పూర్తిగా విస్మరించారని తెలియజేశారు, ఇప్పుడు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్నామని అన్నారు.పదేళ్లలో బిఆర్ఎస్ చేయలేని ఎన్నో పనులను మేము వెయ్యి రోజుల్లో చేసి చూపించామని అన్నారు.పదేళ్లపాటు అధికారంలో ఉండి ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా దగా చేసింది గత బీఆర్ఎస్ ప్రభుత్వమేనని విమర్శించారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, రైతు రుణమాఫీ, ఇంటికో ఉద్యోగం, దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తామని, కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య, దళితులకు మూడెకరాల భూమి, ముస్లింలకు, గిరిజనులకు 12 శాతం రిజర్వేషన్లు వంటి హామీలను అమలు చేయకుండా బీఆర్ఎస్ ప్రజలను దగా చేసిందని మండిపడ్డారు.గత ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను దగా చేయడంతో పాటు, రాష్ట్రాన్ని భారీ అప్పుల కుప్పగా మార్చి, కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆర్థిక భారం మోపిందని ఎమ్మెల్యే జిఎంఆర్ విమర్శించారు. పాలమూరు బిడ్డ ముఖ్యమంత్రి శ్రీ. రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టుకుంటూ, గత ప్రభుత్వం చేసిన ఆర్థిక విధ్వంసాన్ని సరిదిద్దుతూ తెలంగాణను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్నామని పేర్కొన్నారు.

**దేవరకద్రలో 3,500 ఇందిరమ్మ ఇళ్లు**

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దేవరకద్ర నియోజకవర్గంలో 3,500 ఇండ్లను మంజూరు చేశామని, ప్రతి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లతో పండుగ వాతావరణం నెలకొన్నదని, త్వరలోనే రెండో విడత ఇందిరమ్మ ఇండ్లను పంపిణీ చేస్తామని తెలిపారు.మదనపురం మండలంలోనే 319 ఇందిరమ్మ ఇండ్లను, కొత్తకోట మండలంలో 514 ఇండ్లను, కొత్తకోట పట్టణంలో 146 ఇండ్లను మంజూరు చేశామని పేర్కొన్నారు.

గత పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్ని ఇళ్లు ఇచ్చిందో ప్రజలకు సమాధానం చెప్పాలని ప్రశ్నించారు.

**ఉచిత విద్యుత్.. రేషన్ కార్డులు.. సన్నబియ్యం**

రాష్ట్రంలోని అర్హులైన కుటుంబాలకు ఉచిత విద్యుత్ సౌకర్యం కల్పిస్తున్నామని, దేవరకద్ర నియోజకవర్గంలో దాదాపు 48 వేల కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు.అందులో మదనపురం మండలంలో 4394 కుటుంబాలకు, కొత్తకోట పట్టణం మరియు మండలంలో 9743 కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇస్తున్నామని...

కొత్తకోట పట్టణంలో 2852 కుటుంబాలకు, మదనపురం మండలంలో 4570 కుటుంబాలకు, కొత్తకోట మండలంలో 6167 కుటుంబాలకు 500 కే సిలిండర్ ఇస్తున్నామని....

కొత్తకోట మండలంలో 7896, మదనపురం మండలంలో 2399 కొత్త రేషన్ కార్డులు ఇచ్చామని తెలియజేశారు.


కొత్త రేషన్ కార్డులను అందించడంతోపాటు రేషన్ కార్డు పొందిన కుటుంబాలకు దేశంలో ఎక్కడ లేని విధంగా సన్నబియ్యం అందిస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వానిదేనన్నారు.


**రూ.6 కోట్లతో బ్రిడ్జి పూర్తి**


మదనపురం నుండి ఆత్మకూరు వెళ్లే బ్రిడ్జ్ పనులను గత పాలకులు పదేళ్లు గాలికి వదిలేసారని, గతంలో సగం సగంగా నిర్మించి వదిలేసిన బ్రిడ్జి పనులను పూర్తి చేసేందుకు రూ.6 కోట్లు తీసుకొచ్చి పనులు పూర్తి చేశామని చెప్పారు. త్వరలో సంబంధిత మంత్రి చేతుల మీదుగా బ్రిడ్జిని ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.అదేవిధంగా శంకరపేట, దంతనూర్ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న రాకపోకల సమస్య ను పరిష్కరించేందుకు కోటి రూపాయల నిధులతో కొత్త బ్రిడ్జి నిర్మాణాన్ని చేపట్టి పూర్తి చేశామని, త్వరలోనే దానిని కూడా ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నామని చెప్పారు.

మూడు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులకు నిధులు

మదనపురం మండలంలోని మూడు లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలను గత పాలకులు పూర్తిగా నిర్లక్ష్యం చేశారని అన్నారు, కనీసం లిఫ్టుల మెయింటెనెన్స్ కు అవసరమైన నిధులు కూడా గత ప్రభుత్వం విడుదల చేయలేదని అన్నారు.తాను ఎమ్మెల్యేగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని మూడు లిఫ్టుల మరమ్మతులకు ఐదు కోట్ల రూపాయల నిధులు తీసుకొచ్చామని తెలిపారు.దేవరకద్రలో 100 పడకల ఆసుపత్రి, కొత్తకోటలో 30 పడకల ఆసుపత్రి నిర్మాణాలు జరుగుతున్నాయని, గత పదేళ్ల పాలనలో వైద్య రంగాన్ని బిఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదని అన్నారు.విద్య పరంగా పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కనీసం దేవరకద్ర నియోజకవర్గంలో డిగ్రీ కాలేజ్, చిన్నచింతకుంట మండలంలో జూనియర్ కాలేజ్ ఏర్పాటు చేయలేదని, మన ప్రజా ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనలో దేవరకద్రలో డిగ్రీ కాలేజ్, చిన్నచింతకుంట లో జూనియర్ కాలేజ్ ఏర్పాటు చేశామని తెలిపారు .పదేళ్ల బిఆర్ఎస్ పాలన లో కొత్తకోట మదనపురం పట్టణాలలో ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదని, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇవ్వలేదని ఫైర్ అయ్యారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల మేరకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.10 లక్షల ఆరోగ్యశ్రీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్ వంటి హామీలను నెరవేర్చిందని తెలిపారు.ఇచ్చిన మాట మేరకు దేశంలో ఎక్కడా లేని విధంగా 21 వేల కోట్ల రూపాయలతో 25 లక్షల మంది రైతులకు ఏకకాలంలో 2 లక్షల వరకు రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని అన్నారు.బీఆర్ఎస్ పదేళ్లలో చేయలేని పనులను కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల్లో చేస్తుంటే, మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి జీర్ణించుకోలేక, ఫ్రస్టేషన్కు గురవుతున్నాడని ఎద్దేవా చేశారు.ప్రజలు గత పాలనను, ప్రస్తుత పాలనను బేరీజు వేసుకొని ఎంపీ, గ్రామ పంచాయతీ , ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో బిఆర్ఎస్ ను చిత్తుగా ఓడించారని తెలిపారు.









# ఘనంగా శ్రీ కృష్ణాష్టమి వేడుకలు

**గద్వాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 4 (ప్రభాత ఉదయం)**

కేటిదొడ్డి మండలంలో శ్రీ కృష్ణాష్టమి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో చిన్నారులను శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలతో ముస్తాబు చేశారు. కోలాటం, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. కాగా పలు గ్రామాల్లో ఉట్టికొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. వెంకటాపురం వెలసిన పాగుంట శ్రీలక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఉట్టి మహోత్సవం ఉత్సాహంగా సాగింది. యువకులు ఈ కార్యక్రమాల్లో పాల్గొని ఉత్సాహంగా ఉట్టి కొట్టారు.

# జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులకు ఎంపికైన వారికి అభినందనలు తెలిపిన జిల్లా విద్యాశాఖాధికారి విజయలక్ష్మి

**గద్వాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 4 (ప్రభాత ఉదయం)**

ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా 2026 సంవత్సరానికి జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలకు ఎంపికైన ఉపాధ్యాయులకు జిల్లా విద్యాశాఖాధికారి అభినందనలు తెలిపారు. సెప్టెంబర్ 5న గద్వాలలోని ఐడీఓసీ కలెక్టరేట్ కార్యాలయంలోలి ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు.పురస్కార గ్రహీతలైన ఉపాధ్యాయులు ఐడీఓసీ కలెక్టరేట్ సముదాయం, గద్వాల లో శనివారం కార్యక్రమానికి హాజరు కావాలని జిల్లా విద్యాధికారి విజయలక్ష్మి సూచించారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి, నాణ్యమైన విద్య అందించేందుకు విశిష్ట సేవలు అందించిన ఉపాధ్యాయులను సత్కరించడం ఉపాధ్యాయ వృత్తికే గర్వకారణమని పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని ఉపాధ్యాయ సంఘాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హాజరై జిల్లా స్థాయి ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను జయప్రదం చేయాలని సూచించారు.



## రామకృష్ణాపురం గ్రామంలో ఘనంగా శ్రీ కృష్ణాష్టమి వేడుకలు

### కృష్ణాష్టమి సందర్భంగా పుట్టి కొట్టిన యాదవ సోదరులు

**కొత్తకోట, సెప్టెంబర్ 4 (ప్రభాత ఉదయం)**

కొత్తకోట మండలం రామకృష్ణాపురం గ్రామంలో శ్రీ కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం గ్రామంలోని శ్రీ వేణుగోపాలస్వామి, శ్రీ ఆంజనేయస్వామి ఆలయ ఆవరణలో శ్రీ కృష్ణాష్టమి సందర్భంగా యాదవ సోదరులు కొట్టారు. గ్రామంలో వేణుగోపాల స్వామివారి ఆలయంలో పూజలు నిర్వహించి అనంతరము ఉట్ల పండుగ ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు. శ్రీకృష్ణాష్టమి ఉట్ల పండుగ కార్యక్రమం ప్రతి సంవత్సరం రోహిణి నక్షత్రంలో జరుపుకోవడం అనవాయతుగా వస్తున్న ఆచారంగా భావిస్తారు. ఈ వేడుకల్లో శివ రాముడు యాదవ్, గ్రామ నాయకులు గ్రామ భక్తులు పాల్గొన్నారు.



## సద్దలోనిపల్లిలో ఘనంగా శ్రీ స్వయంభు కృష్ణాష్టమి బ్రహ్మోత్సవాలు

### కృష్ణస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసిన గద్వాల సీఐ టి.శ్రీను దంపతులు

**గద్వాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 4 (ప్రభాత ఉదయం)**

మల్దకల్ మండలం సద్దలోనిపల్లి గ్రామంలో స్వయంభూ శ్రీ కృష్ణ స్వామి ఆలయంలో కృష్ణాష్టమి బ్రహ్మోత్సవాలు శుక్రవారం వైభవంగా జరిగాయి. బ్రహ్మోత్సవాల సందర్భంగా సద్దలోనిపల్లి గ్రామం భక్తి శోభతో విలసిల్లింది. ఆలయ పరిసరాలు భక్తుల రాకతో కిటకిటలాడాయి. భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా గద్వాల సీఐ టి. శ్రీను దంపతులు కృష్ణస్వామిని దర్శించుకుని, ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆలయ ప్రాంగణానికి చేరుకున్న సీఐ దంపతులకు ఆలయ అర్చకులు పాండు స్వామి, నిర్వాహకులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు.అనంతరం స్వామివారి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలను అందజేశారు.ఈ సందర్భంగా సీఐ టి. శ్రీను మాట్లాడుతూ.. "ఇలాంటి ఆధ్యాత్మిక బ్రహ్మోత్సవాలు ప్రజలలో భక్తి భావాన్ని, సమాజంలో ఐక్యతను పెంపొందిస్తాయి అని కృష్ణస్వామి ఆశీస్సులు ప్రజలందరికీ ఉండాలని కోరుకుంటున్నాను" అని తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బెల్లం నరసింహులు, మల్దకల్ ఎస్సై కొండ శ్రీహరి, పోలీస్ సిబ్బంది, ఆలయ కమిటీ ప్రతినిధులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.




## గద్వాలను కరువు జిల్లాగా ప్రకటించాలి:

### సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఆర్. శ్రీరామ్ నాయక్

**గద్వాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 4 ( ప్రభాత ఉదయం)**

జోగులాంబ గద్వాల జిల్లాలో కరువు జిల్లాగా ప్రకటించి ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఆర్. శ్రీరామ్ నాయక్ డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని స్థానిక సిపిఎం జిల్లా కార్యాలయంలో జీకే ఈదన్న అధ్యక్షతన జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జోగులాంబ గద్వాల జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించి రైతులు పంటలకు ప్రత్యామ్నాయ పరిరక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కోట్లాది రూపాయల ప్రజాదనంతో ప్రాజెక్టులు రిజర్వాయర్లు నిర్మించినప్పటికీ పాలకులు,అధికారుల నిర్లక్ష్యం వల్ల వరద నీరు సైతం సక్రమంగా వినియోగించుకునే పరిస్థితులు లేవన్నారు.ప్రజల్లో విశ్వాసాన్ని కోల్పోతున్న బిజెపి చట్ట సభలలో ప్రజాస్వామ్య వ్యతిరేక బిల్లులు ఆమోదించుకోవడానికి,ప్రతిపక్ష ఎంపీ లను ప్రలోభాలకు, బెదిరింపులకు గురి చేసి పార్టీలోకి చేర్చుకుంటున్నదని విమర్శించారు.బీజేపీ అనుసరిస్తున్న నిరంకుశ విధానాల వల్ల విసిగిపోయిన యువతరం ప్రజాస్వామ్య ఉద్యమాలు చేస్తుంటే, వారిని సైతం అణచివేస్తున్నదని విమర్శించారు.దేశంలో తీవ్ర ఉపాధి సమస్యలు పెరుగుతుంటే,వృద్ధి రేటు ఏ విధంగా పెరిగిందో బిజెపి నాయకులు బహిరంగ చర్చకు రావాలన్నారు.కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ప్రజలకు,సమాజం లోని వివిధ సామాజిక వర్గాలకు ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలు చేయడం లేదని విమర్శించారు.హామీలు అమలు చేయకపోగా పేద రైతుల భూములను అక్రమంగా 22 ఏ లో చేర్చి రైతాంగాన్ని గందరగోళానికి గురి చేస్తున్నారని విమర్శించారు. ఈ సందర్భంగా సి పి ఎం జిల్లా కార్యదర్శి ఏ వెంకటస్వామి మాట్లాడుతూ జిల్లాలో రైతుల పట్టా భూములను కొంతమంది అధికారులు లంచాలు తీసుకొని ఎటువంటి విచారణ చేయకుండా వేరే వ్యక్తుల పేరిట రిజిస్ట్రేషన్ చేస్తున్నారని విమర్శించారు.జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో వరుసగా వైద్యుల నిర్లక్ష్యం వల్ల వైద్యం వికటించి పేదలు మరణిస్తున్న అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదన్నారు.రాజకీయ ప్రతినిధుల అండతో ఏళ్ల తరబడి బదిలీ కాకుండా అక్రమాలకు,రోగుల చావులకు కారణం అవుతున్న వైద్యాధికారులను తక్షణమే బదిలీ చేయాలని డిమాండ్ చేశారు.జిల్లాలో ప్రైవేటు పాఠశాలలో విచ్చలవిడిగా ఫీజులు వసూలు చేస్తున్న అధికార యంత్రాంగం కనీసం ఆ వైపు చూడటం లేదని విమర్శించారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల స్వీపర్లకు కలెక్టర్ నిధుల నుండి వేతనాలు ఇచ్చే అవకాశం ఉన్నా,అధికార యంత్రాంగం అత్యంత నిర్లక్ష్యపూరితంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. జిల్లా స్థాయిలో అధికార యంత్రాంగం తమ పరిధిలో సమస్యలను పరిష్కారం చేయడానికి అవకాశం ఉన్నా పట్టించుకోవడం లేదన్నారు.ప్రజా సమస్యల పట్ల అధికారుల ధోరణిని మార్చుకోకపోతే ప్రజలను సమీకరించి ఉద్యమిస్తామని హెచ్చరించారు.ఈ సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు రేపల్లె దేవదాసు,జీ.రాజు,వీవీ నరసింహ, మద్దిలేటి,ఉప్పేర్ నరసింహ,నర్మదా పాల్గొన్నారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: MEKALA DAMODAR REDDY. "RNI. Title- Code: TELTEL12231**. Cell:9391089608